కానీ రాష్ట్రంలో జరిగిన ఘటనల విషయంలో మౌనంగా ఉంటుంది. లాకప్పు హత్యలకు బాధ్యులైన అధికారులను ఎన్‌కౌంటర్ హత్యలకు బాధ్యులైన అధికారులను శిక్షించలేదు. కరువు, వరదల వంటి సమస్యల గురించి పట్టించుకోదు.

తెలుగుదేశం పార్టీ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం అవినీతి చర్యలను విమర్శించడం కుట్ర, ద్రోహం కాదని చెప్పుతూనే రాష్ట్రంలో ప్రత్యర్థుల విషయంలో వ్యతిరేక దృక్పథాన్ని అవలంబిస్తుంది. కనుక కాంగ్రెసు, తెలుగుదేశం మధ్య పని విధానంలో తేడాలేదు. ఆ రెండూ కూడా అధికారంలోవుండి ప్రజాసంక్షేమాన్ని విస్మరించేవే. అందుకే వ్యక్తులు మారితే చాలనుకుంటాయి.

కనుక గమనించ వలసిందేమిటంటే గద్దెమీద ఎవ్వరు కూర్చున్నారని కాదు, ఎలా పని చేస్తున్నారన్నది. వ్యక్తుల మారాలనికాదు డిమాండు చేయాల్సింది, ఆ పని విధానమే మారాలని డిమాండు చేయాలి. అప్పుడే తరుచుగా సాగే అవినీతి చర్యలు, అధికార దుర్వినియోగం అరికట్టగలం. అందుకే ప్రజాస్వామిక విలువలను జాతి జీవితంలో విస్తృతంగా ప్రచారం చేయాలి.

## వ్యాసం

# ఎ.పి.సి.ఎల్.సి. కార్యక్రమాలు- ఒక సమీక్ష

[12 ఏప్రిల్ 1987 నాడు విజయవాడలో జరిగిన ఎ.పి.సి.ఎల్.సి. 5వ రాష్ట్ర మహాసభల సందర్భంగా, 4వ రాష్ట్ర మహాసభలకూ 5వ రాష్ట్ర మహాసభలకూ మధ్య ఎ. పి. సి. ఎల్. సి. చేపట్టిన కార్యక్రమాల సంక్షిప్త సమీక్షను ఇక్కడ ఇస్తున్నాం. —సం॥]

### 1983 - 84 :

ఎ. పి. సి. ఎల్. సి. 4వ రాష్ట్ర మహాసభలు 29 అగస్టు 1983 నాడు ఖమ్మం పట్టణంలో జరిగాయి. అప్పటి నుండి 1984 చివరి దాకా సంస్థ కార్యక్రమాలు ప్రధానంగా తెలంగాణా గ్రామాలలోనూ తూర్పు గోదావరి, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలోనూ అమలవుతున్న తీవ్రమయిన నిర్బంధం మీద కేంద్రీకరించి వున్నాయి.

1983 జూలై నెలనుండి ఈ నిర్బంధం తీవ్ర రూపం తీసుకుంది. అగస్టు చివరి వారం నాటికి ఉత్తర తెలంగాణా జిల్లాలలో కనీసం 100 గ్రామాలలో సాయుధ పోలీసు క్యాంపులున్నాయి. పోలీసు స్టేషన్లన్నీ పేదరైతుల, కూలీల, విద్యార్థుల, చిత్రహింసలకు కేంద్రాలయ్యాయి. కాకతీయ విశ్వవిద్యాలయమే ఒక పెద్ద పోలీసు క్యాంపు అయింది. ఈ నిర్బంధాన్ని ఎ.పి.సి.ఎల్.సి వివిధ రూపాలలో ఎదుర్కొంది. రాష్ట్ర వ్యాపితంగా కరపత్రాలు పంచి, హైదరాబాద్, వరంగల్, విజయవాడ, కరీంనగర్, విశాఖపట్నంలలో బహిరంగ సభలు నిర్వహించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తదితర పత్రికల విలేఖరులను నిర్బంధ ప్రాంతాలకు తీసుకుపోయి వివరమయిన రిపోర్టులు పత్రికలలో వచ్చేలాగ చూసింది.

బయటి రాష్ట్రాలలో ప్రచారం చేయడం కోసం Repression on the Rural poor in A. P., N T R's one year అనే రెండు పుస్తకాలు అచ్చువేసి (రెండవ పుస్తకం ఢిల్లీ PUDR సహకారంతో) బెంగుళూరు, నాగ్‌పూర్, బొంబాయి, ఢిల్లీలలో అక్కడి స్థానిక పౌరహక్కుల సంస్థలు నిర్వహించిన సభలలో ఎ పి సి ఎల్ సి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, మాట్లాడారు.

1984 జూలై నెల నుండి ఎ పి సి ఎల్ సి అధికార మాసపత్రిక "స్వేచ్ఛ" ప్రచురణ మొదలయింది. ఉత్తర తెలంగాణా జిల్లాలలో అమలవుతున్న నిర్బంధాన్ని గురించి వివరమైన మౌలికమైన రిపోర్టులు "స్వేచ్ఛ"లో ప్రచురించడం మొదటి సంచిక నుండి మొదలయింది. ఇప్పటికి (ఈ సంచికతో కలుపుకొని) 30 సంచికలు వచ్చాయి.

పోలీసు కస్టడీలో మరణాల గురించి వివరంగా విషయాలు సేకరించి ప్రచారం చేయడం 1984లో మొదలయింది. ఆ సంవత్సరం మన రాష్ట్రంలో వెలుగులోకి వచ్చిన 24 కస్టడీ మరణాల మీద ఎ పి సి ఎల్ సి వివరంగా విషయ సేకరణ జరిపి "పోలీసు కస్టడీలో మరణాలు -1984" అనే పుస్తకం ప్రచురించింది. అందులో ఆ 24 హత్యల వివరాలే కాక పోలీసు కస్టడీలో చిత్రహింసలు, అక్రమ నిర్బంధం, విధి నిర్వహణలో బలప్రయోగం తదితర విషయాల మీద చట్టం ఏమంటుందో కూడ తెలపడం జరిగింది. అప్పుడు ప్రారంభించిన వరవడి ఇప్పటిదాకా నిలుపుకొని ఇవ్వాళ "లాకప్పు మరణాల" గురించి రాష్ట్ర వ్యాపితంగా ఏర్పడిన చైతన్యానికి ఎ పి సి ఎల్ సి దోహదం చేసింది.

సుప్రీం కోర్టుకు రిట్ పిటిషన్లు పంపడం కూడ ఈ దశలో గతంలోకంటే విరివిగా జరిగింది. వరంగల్ జిల్లాలోని పోలీసు క్యాంపులలోనూ పోలీస్ స్టేషన్లలోనూ అమలవుతున్న చిత్రహింసలు ఇతర అత్యాచారాలమీద విచారణ జరిపించాలని సుప్రీం కోర్టులో ఢిల్లీ పి యు డి ఆర్ తో సంయుక్తంగా ఒక రిట్ పిటిషన్ వేయడం జరిగింది. అంతిమ దశలో ఆ పిటిషన్‌లో 530 నిర్దిష్టమయిన అత్యాచారాల వివరాలు ఇవ్వడం జరిగింది. అది ప్రస్తుతం సుప్రీం కోర్టులో ఫైనల్ హియరింగ్‌కు వచ్చి ఉంది. అదే పిటిషన్‌ను మన రాష్ట్ర లోకాయుక్త దగ్గర కంప్లెయింట్‌గా వేయడం జరిగింది.

1984లోనూ ఆ తరువాతి సంవత్సరం, గుంటూరు జిల్లా నుండి లాకప్పు మరణాలు మానభంగం తదితర అత్యాచారాల మీద సుప్రీం కోర్టుకు ఉత్తరాల రూపంలో ఫిర్యాదులు ఆ జిల్లా ఎ పి సి ఎల్ సి బాధ్యులు పంపారు. అందులో మూడింటిని సుప్రీంకోర్టు స్వీకరించి జిల్లా కలెక్టరు లేక చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ల చేత విచారణలు జరిపించింది.

1984 సెప్టెంబర్ నెలలో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని అప్పటి రాష్ట్ర గవర్నర్ రాంలాల్ బర్తరఫ్ చేయడానికి జరిపిన ప్రయత్నం మన రాష్ట్ర రాజకీయాలలో ప్రముఖ సంఘటన.

అప్రజాస్వామికమయిన ఆ బర్తరఫ్‌కు వ్యతిరేకంగా ప్రజలలో నిరసన చెలరేగింది. దానిని అణచడానికి నాదెండ్ల భాస్కరరావు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి కాల్పులు జరిపించింది. హైదరాబాద్ పరిసరాలలోనూ రాయలసీమ జిల్లాలలోనూ మొత్తం 25 మంది చనిపోయారు. ఈ 25 మరణాలమీద ఓ పి.డి.ఆర్.తో కలిసి నిజనిర్ధారణ జరిపి అనంతపురంలో బహిరంగసభ నిర్వహించడం, పత్రికా ప్రకటన ఇవ్వడం, జరిగింది.

1984 నుండే "పంజాబు సమస్య" ఒక రాజకీయ సమస్యగా ముందు కొచ్చింది. ఖలిస్తాన్ వాదుల రాజకీయాల మంచి చెడులతో ఎ పి సి ఎల్ సి కి నిమిత్తం లేనప్పటికీ ఆ రాజకీయ సమస్యను రాజకీయంగా పరిష్కరించే ప్రయత్నం చేయకుండా కేంద్ర ప్రభుత్వం అణచివేత వైఖరిని అవలంబించడం, నల్ల చట్టాలను తయారు చేయడం, వ్యతిరేకించాల్సిన విషయాలయ్యాయి. టెర్రరిస్టు ప్రాంతాల (ప్రత్యేక కోర్టుల) చట్టం అనే అతి ప్రమాదకరమయిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తయారు చేసినప్పుడు దానికి నిరసనగా ఎ పి సి ఎల్ సి హైదరాబాద్, వరంగల్, విజయవాడలలో బహిరంగ సభలు జరిపింది. పంజాబును రాజకీయ సమస్యగా కాక శాంతి భద్రతల సమస్యగా పరిగణించి అణచివేత ప్రయోగించే కేంద్ర రాజకీయ కుటిలనీతిని బహిర్గతం చేస్తూ వరంగల్‌లో జార్జి ఫెర్నాండెజ్ చేత లెక్చర్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందిరాగాంధీ మరణానంతరం అధికార యంత్రాంగం ప్రోద్బలంతో ఉత్తర భారత దేశంలోని ఢిల్లీ కాన్పూర్ తదితర పట్టణాలలో సిక్కు మతస్తులను వేల సంఖ్యలో కాంగ్రెస్ మద్దతుదారులు చంపారు. ఈ హత్యాకాండకు నిరసనగా ఎ పి సి ఎల్ సి హైదరాబాద్‌లో బహిరంగ సభ జరిపింది.

1983లో అధికారానికి వచ్చిన ఎన్టీఆర్ ప్రభుత్వం ఒక సంవత్సరం తిరిగేలోపల తన పార్టీ ప్రణాళికలోని ప్రతి అంశాన్నీ ఎంత సమగ్రంగా అతిక్రమించిందీ వివరిస్తూ "అన్నా వచ్చిండు" అనే పుస్తకం (NTR's one year అనే ఆంగ్ల పుస్తకానికి తెలుగు అనువాదం) ఎ పి సి ఎల్ సి 1984లో ప్రచురించింది.

## 1985 :

1985 ఎ పి సి ఎల్ సి మీద దాడులు పెద్ద ఎత్తున జరిగిన సంవత్సరం. అంతవరకు ప్రజలమీద జరుగుతున్న అత్యాచారాలు ఇప్పుడు ఒక్కసారిగా వాటికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఎ పి సి ఎల్ సి కార్యకర్తల మీదికి దృష్టి మరల్చాయి.

1985 జనవరి 12వ తేదీన కరీంనగర్ జిల్లా ఎ పి సి ఎల్ సి కార్యవర్గ సభ్యుడు గోపి రాజన్నను జగిత్యాలలో ఆర్ ఎస్ ఎస్ కు చెందిన గుండాలు హత్య చేసారు, నెల చివరిలో వరంగల్‌లో ఎ పి సి ఎల్ సి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా॥ రామనాథం గారిని, ప్రధాన కార్యదర్శి డా॥ బాలగోపాల్‌ను, జిల్లా కార్యవర్గ సభ్యుడు సీతారామరావును పోలీసులు అరెస్టుచేసి తప్పుడు కేసులు బనాయించారు. ఈ రెండు సంఘటనలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో బహిరంగ సభలు జరిగాయి.

ఏప్రిల్ నెలలో ఆదిలాబాద్ జిల్లాలో బాలగోపాల్‌ను, సీతారామరావునూ, మురళీ మనోహర్‌నూ, వాళ్ళతోబాటు మనోరంజన్ మొహంతిని అరెస్టుచేసి తప్పుడు కేసు బనాయించారు. మే నెలలో కరీంనగర్ జిల్లా జగిత్యాల బస్ స్టాండులో బాలగోపాల్‌మీద, అడ్వకేట్ శంకర్‌మీద గుండాలు దాడిచేసి కొట్టి తీవ్రంగా గాయపరిచారు.

మే నెల చివరి వారంలో ఎ పి సి ఎల్ సి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్, సుబ్రహ్మణ్యం, డా॥ కాటా నారాయణరావు, గుర్నాథం లను, వాళ్ళతో బాటు ఓ పి డి ఆర్ బాధ్యుడు డి. వెంకటేశ్వరరావును తూర్పు గోదావరి జిల్లా పోలీసులు అరెస్టుచేసి తప్పుడు కుట్రకేసు బనాయించారు. ఈ అక్రమాన్ని వ్యతిరేకిస్తూ ఎ పి సి ఎల్ సి, ఓ పి డి ఆర్ లు కలిసి విజయవాడలో (జూన్ 19న), గుంటూరులో (జూన్ 20న) ఒంగోలులో (జూన్ 26న) బహిరంగ సభలు జరిపారు.

జూన్ నెల తరువాత ఈ దాడులు మరింత పెరిగాయి. నిజామాబాద్ జిల్లా ఎ పి సి ఎల్ సి అధ్యక్షులు పోశెట్టి గారిని రెండుసార్లు నిష్కారణంగా అరెస్టు చేసారు. సెప్టెంబర్ 3వ తేదీన వరంగల్‌లో డా॥ రామనాథంగారి క్లినిక్‌మీద పోలీసులు దాడిచేసి ఆయనను కాల్చి చంపారు. అక్టోబర్ 30వ తేదీన సీతారామరావు ఇంటిమీద పోలీసులు మఫ్టీలో దాడిచేసి అతన్ని కర్రలతో గొడ్డళ్ళతో కొట్టి తీవ్రంగా గాయ పరిచారు. నవంబర్ 16న హైదరాబాద్‌లో బాలగోపాల్‌ను టెర్రరిస్టు చట్టం కింద అరెస్టు చేసి డిసెంబర్ 2వ తేదీన నాసా వారంట్ కూడ ప్రయోగించారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఇంత నిర్బంధం మధ్య కూడ ఎ పి సి ఎల్ సి కార్యక్రమాలు కుంటుపడలేదు. 1985 అంతా కూడ సంస్థ కార్యక్రమాలు కొనసాగుతూనే వున్నాయి. నిర్బంధానికి వ్యతిరేకంగా జరిగిన కొన్ని నిరసన సభల గురించి పైన చెప్పాము. అవికాక, ఎ పి సి ఎల్ సి మీటింగులను సహితం పోలీసులు ఆటంక పరుస్తున్న తరుణంలో ఆ నిర్బంధాన్ని భగ్నం చేయడం కోసం అప్పటి పి యు సి ఎల్ జాతీయ అధ్యక్షుడయిన ప్రొఫెసర్ రజనీ కొఠారిని ఆహ్వానించి 1985 ఏప్రిల్ 6న కరీంనగర్‌లో ఏప్రిల్ 7న వరంగల్‌లో సభలు నిర్వహించడం జరిగింది. పెద్ద ఎత్తున పోలీసు పహారా పెట్టినప్పటికీ రెండు సభలకూ జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

1985 మార్చి నెల నుండి "ఎన్ కౌంటర్లు" మళ్ళీ పెద్ద ఎత్తున మొదలయ్యాయి. అప్పుడు మొదలయిన "ఎన్‌కౌంటర్ల" పరంపర ఇప్పటిదాకా ఆగలేదు. మొదట్లో జరిగిన అన్ని "ఎన్‌కౌంటర్ల" మీద నిజ నిర్ధారణ కమిటీలను వేయడం జరిగింది. కొన్నిచోట్ల కమిటీ అతి క్లిష్టమయిన పరిస్థితులలో తన పని జరుపుకొని బయటపడింది. రాష్ట్ర వ్యాపితంగా ఈ ఎన్‌కౌంటర్లను ఎండగట్టే కార్యక్రమం చేపట్టడం జరిగింది. అందులో భాగంగా జూన్ 11వ తేదీన ముఖ్యమంత్రి దగ్గరికి జార్జి ఫెర్నాండెజ్, నాయని నరసింహారెడ్డి, ప్రొఫెసర్ జగ్మోహన్‌సింగ్ తదితరులతో ఒక డెలిగేషన్ వెళ్ళి మెమొరాండం సమర్పించింది. ఆ సాయంత్రం బహిరంగ సభ జరిగింది.

ఈ కార్యక్రమాన్ని ఎదుర్కొనడానికి ప్రభుత్వమూ

స్వేచ్ఛ

పోలీసు అధికారులూ ఒకవైపు ఎ పి సి ఎల్ సి కార్యకర్తల మీద దాడులు కొనసాగిస్తూ వేరొక వైపు సంస్థమీద దుష్ప్రచారం మొదలు పెట్టారు. పోలీసులు అక్రమాలు చేస్తే ఎ పి సి ఎల్ సి ఖండిస్తుందిగాని వేరే ఎవ్వరు చేసినా ఖండించదనీ, నక్సలైట్ల హింసాకాండను ఎ పి సి ఎల్ సి సమర్థిస్తుందనీ, అన్నారు. వీటికి సమాధానం చెపుతూ ఎ పి సి ఎల్ సి అధ్యక్షులు ముఖ్యమంత్రికి ఒక "బహిరంగ లేఖ" రాసారు. దాని సారాంశం ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దిన పత్రికలో అచ్చయింది. "బహిరంగ లేఖ"ను తెలుగులోకి అనువదించి 10,000 కాపీలు అచ్చువేసి రాష్ట్ర వ్యాపితంగా పంచాము.

ఇంతలో "కారంచేడు" జరిగింది. జూలై 17 నాడు కారంచేడు గ్రామంలో భూస్వాములు దళితుల ఇళ్ళమీద దాడిచేసి ఆరుగురు మగవాళ్ళను చంపి ముగ్గురు స్త్రీలమీద అత్యాచారం చేసారు. ఆ సంఘటన మీద ఎ పి సి ఎల్ సి వెంటనే నిజనిర్ధారణ కమిటీని వేసింది. కమిటీలో ఎ పి సి ఎల్ సి బాధ్యులేకాక నాగార్జున విశ్వవిద్యాలయం నుండి అధ్యాపకులు కూడా ఉన్నారు. కమిటీ నివేదికను పత్రికలకు విడుదల చేయడమేకాక, ఆ అత్యాచారం పూర్వాపరాలను వివరిస్తూ "కారంచేడు నుండి గుజరాత్‌దాక" అనే బుక్‌లెట్ 10,000 కాపీలు అచ్చువేసి విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. అగస్టు 3న విజయవాడలో, 4న విశాఖపట్నంలో, 11న వికారాబాద్‌లో, 25న గుంటూరులో బహిరంగ సభలు జరిగాయి. అప్పటినుండి దళిత మహాసభ కార్యక్రమాలకు ఎ పి సి ఎల్ సి సన్నిహితంగా ఉంటూ ఉంది. అక్టోబర్ 8వ తేదీన దళిత మహాసభ విజయవాడలో ఏర్పరచిన బహిరంగసభ మీద పోలీసులు దాడిచేసి కత్తి పద్మారావు గారిని అరెస్టు చేసినప్పుడు ఆ దాడిని ఖండిస్తూ ఎ పి సి ఎల్ సి అక్టోబర్ 10వ తేదీన గుంటూరులో నిరసన సభ జరిపింది.

సెప్టెంబర్ 3వ తేదీన డాక్టర్ రామనాథం గారిని చంపేయడంతో ఎ పి సి ఎల్ సి ఇక పని చేయడం మానేస్తుందని ప్రభుత్వం ఆశించింది. ఆ ఆశను వమ్ముచేస్తూ ఆ హత్యకు వ్యతిరేకంగా నిరసన సభలు రాష్ట్ర వ్యాపితంగా జరిగాయి. సెప్టెంబర్ 15న హైదరాబాద్‌లో జరిగిన సభలో జార్జి ఫెర్నాండెజ్, రజనీ కొఠారి తదితరులు మాట్లాడారు. హైదరాబాద్‌లోనేకాక సెప్టెంబర్ 13న విశాఖపట్నంలో, 18న గుంటూరులో, 22న అనంతపురంలో, 28న విజయవాడలో, 29న ఒంగోలులో, సభలు జరిగాయి. గుడివాడలో పోలీసు కస్టడీలో చనిపోయిన పావులూరి రాజా చౌదరి మరణాన్నీ పింగళి దశరధరాం హత్యనూ డాక్టర్ రామనాథంగారి హత్యనూ ఖండిస్తూ అక్టోబర్ 26న గుడివాడలో అక్టోబరు 27న మచిలీపట్నంలో బహిరంగ సభలు జరిగాయి.

అదే సమయంలో మన రాష్ట్రంలో ప్రెస్‌బిల్లు పోలీస్ బిల్లులను గురించి సంచలనం చెలరేగింది. ప్రెస్‌బిల్లు మీద జంట నగరాల శాఖ పోస్టర్లువేసి హైదరాబాద్‌లో ప్రచారం చేసింది. పోలీస్ బిల్లుమీద "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" నిర్వహించిన చర్చలో ఎ పి సి ఎల్ సి బాధ్యులు పాల్గొన్నారు. ఈ రెండు బిల్లులకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితమయిన కార్యక్రమం చేపట్టాలని అనుకుంటూండగా నవంబర్ 16న ఎ పి సి ఎల్ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కాజీపేట ఎస్ ఐ హత్యలో అక్రమంగా ఇరికించి టెర్రరిస్టు చట్టం క్రింద అరెస్టు చేయడం జరిగింది.

అయితే ఆ లోపల 1985లో జరిగిన "ఎన్‌కౌంటర్" హత్యలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ వేయడం జరిగింది. అప్పటివరకు జరిగిన అన్ని హత్యలమీదా మెజిస్టీరియల్ విచారణలు జరిగాయనీ ఆ విచారణ నివేదికలను సుప్రీం కోర్టు తెప్పించి పరిశీలించ వలసిందనీ ఆ రిట్ పిటిషన్‌లో కోరడం జరిగింది.

## 1986 :

1986 నుండి మన రాష్ట్రంలో సాధారణ ప్రజానీకం మీద పోలీసు అత్యాచారాల ఉధృతి పెరిగింది. దానితోబాటు ఎ పి సి ఎల్ సి కార్యక్రమాల విస్తృతి కూడా పెరిగింది. ఫిబ్రవరి మొదటి రోజుల్లో విజయవాడలో జరిగిన ముదిగొండ పద్మ తదితరుల "శిరోముండనం" ఉదంతాన్ని, గొడ్డళ్ళ రామారావు కస్టడీ మరణాన్ని ఖండిస్తూ కంచికచర్లలో ఫిబ్రవరి 15న, విజయవాడలో ఫిబ్రవరి 22న బహిరంగ సభలు జరిగాయి.

ప్రభుత్వ ఉద్యోగులకు విచారణ లేకుండా సర్వీసు నుండి తొలగించ వచ్చునని రాజ్యాంగంలోని అధికరణం 311 (2) (a), (b), (c) క్లాజులలో చెప్పిన విషయాన్ని ధృవీకరిస్తూ సుప్రీం కోర్టు యిచ్చిన తీర్పును విమర్శనాత్మకంగా పరిశీలిస్తూ "ఆర్టికల్ 311 (2) పైన సుప్రీం కోర్టు తీర్పు - ఒక పరిశీలన" అనే పుస్తకం ప్రచురించి ఫిబ్రవరి 6వ తేదీన హైదరాబాద్‌లో ఆవిష్కరించి ఆ తరువాత ఫిబ్రవరి 26న విజయవాడలో మే 17న ఒంగోలులో మే 23న అనంతపురంలో ఈ విషయంమీద బహిరంగ సభలు నిర్వహించడం జరిగింది. అన్ని సభలలోనూ అధ్యాపకుల, ఉద్యోగుల, సంఘాల బాధ్యులూ సభ్యులూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

1986 "పి యు సి ఎల్ జర్నలిజం ఫర్ హ్యూమన్ రైట్స్" అవార్డు ప్రదానం హైదరాబాద్‌లో జరిగింది. ఆ సందర్భంలో అంతకు ముందు సంవత్సరం (అంటే 1985) లో జరిగిన ప్రజా హక్కుల అతిక్రమణను వివరిస్తూ Report on Peoples' Rights 1985 అనే పుస్తకాన్ని ఇంగ్లీష్‌లో ప్రచురించి అచ్చువేయడం జరిగింది.

చాలా తీవ్రంగా కరువు బాధ అనుభవిస్తున్న అనంతపురం జిల్లాలోని కరువు ప్రాంతాలను మే 20, 21, 22 తేదీలలో ఎ పి సి ఎల్ సి నిజ నిర్ధారణ కమిటీ పర్యటించింది. పర్యటించిన పిదప 22 సాయంత్రం ధర్మవరంలో బహిరంగ సభ జరిగింది. "అనంతపురం జిల్లాలో కరువు" అనే పుస్తకం ప్రచురించి రాష్ట్ర వ్యాపితంగా అమ్మడం జరిగింది. కరీంనగర్ జిల్లా గోదావరి ఖని బొగ్గు గనులలో విష వాయువు "లీక్" అయి ఏడుగురు కార్మికులు మరణించిన సందర్భంగా నిజ నిర్ధారణ కమిటీ వేసి అది "ఆక్సిడెంట్" ఎంతమాత్రం కాదనీ, మేనేజ్‌మెంట్ నిర్లక్ష్యం మాత్రమేననీ బహిర్గతం చేయడం జరిగింది.

1985లో మొదలయిన ఎన్‌కౌంటర్లు 1986లో కూడా కొనసాగాయి. అల్లూరి సీతారామరాజు వర్ధంతి దినం అయిన మే 7వ తేదీన ఎ పి సి ఎల్ సి ఓ పి డి ఆర్‌లు సంయుక్తంగా హైదరాబాద్‌లో ఎన్‌కౌంటర్ల వ్యతిరేక దినాన్ని పాటించి బహిరంగసభ జరిపాయి.

1985లో ఎ పి సి ఎల్ సి మీద ఎడతెరిపి లేకుండా జరిగిన దాడుల ఫలితంగా బలహీనపడిన సంస్థ నిర్మాణాన్ని పటిష్ఠం చేసుకోవడం కోసం జూన్ 7వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఆ తరువాత ఆగస్టు 9వ తేదీన కొత్తగా నెల్లూరు జిల్లాశాఖ ఆవిష్కరించబడింది. ఆ రోజు నెల్లూరులోనూ తరువాత రోజు (10 ఆగస్టు) కావలిలోనూ బహిరంగ సభలు జరిగాయి.

సెప్టెంబరు వచ్చేసరికి డాక్టర్ రామనాథం గారిని చంపి ఒక సంవత్సరం గడిచింది. ఆ సంవత్సర కాలంలో రాష్ట్రంలో ప్రజలమీద జరిగిన పోలీసు అత్యాచారాలను వాటి సామాజిక ఆర్థిక నేపధ్యంలో వివరిస్తూ "తెలుగుదేశంలో పోలీసు రాజ్యం" అనే పుస్తకాన్ని ఎ పి సి ఎల్ సి ప్రచురించింది. రామనాథంగారి ప్రథమ వర్ధంతి సభలు పెద్ద ఎత్తున జరిగాయి. సెప్టెంబరు 3న హైదరాబాద్‌లో, 4న విజయవాడలో, 5న గుంటూరులో, 10న విశాఖపట్నంలో, 14న కావలి అనంతపురం పట్టణాలలో, 15న ఒంగోలులో బహిరంగ సభలు జరిగాయి.

1986 సెప్టెంబరు నెలలో మన రాష్ట్రంలో "లాకప్పు మరణాలు" ఒక్కసారిగా చెలరేగాయి. ఎ పి సి ఎల్ సి ఆ అన్ని మరణాలమీద నిజ నిర్ధారణ కమిటీలు పంపింది. మాచర్ల (గుంటూరు జిల్లా) కేసులో వాస్తవాలను వెలికి తేవడానికి చాలా కృషి చేసింది. ఈ లాకప్పు మరణాలను ఖండిస్తూ అక్టోబర్ 7న మాచర్లలో, 15న హైదరాబాద్‌లో, 16న వికారాబాద్‌లో, బహిరంగ సభలు జరిగాయి. మాచర్ల, ఖమ్మం, లాకప్పు మరణాల న్యాయ విచారణలలో ఆయా జిల్లాల ఎ పి సి ఎల్ సి యూనిట్లు చురుగ్గా పాల్గొంటున్నాయి.

ఒకవైపు లాకప్పు మరణాలమీద ఎ పి సి ఎల్ సి తీవ్రంగా కృషి చేస్తుండగా వేరొకవైపు మళ్ళీ సంస్థ మీద దాడులు మొదలయ్యాయి. నవంబరు 7వ తేదీన కరీంనగర్ జిల్లా అల్గునూరులో ఎ పి సి ఎల్ సి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాపా లక్ష్మారెడ్డి గారిని పోలీసులు కాల్చి చంపారు. అత్యంత దారుణంగా జరిగిన ఈ హత్యకు నిరసనగా ఎ పి సి ఎల్ సి హైదరాబాద్‌లో నవంబర్ 30న జరిపిన బహిరంగసభలో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి శ్రీ కృష్ణఅయ్యర్ ప్రసంగించారు. అంతకు ముందు నవంబర్ 18న విజయవాడలోనూ 19న గుంటూరులోనూ బహిరంగ సభలు జరిగాయి. "తెలుగుదేశంలో పోలీసు రాజ్యం" రెండవ ముద్రణ ఈ సభల నాటికి వచ్చింది. దాదాపు అదే సమయంలో ఏలూరులోని శ్రీ కృష్ణ జూట్‌మిల్లు కార్మికుల పని పరిస్థితుల మీద ఎ పి సి ఎల్ సి ఒక నిజ నిర్ధారణ కమిటీని వేసి వివరంగా పరిశీలన జరిపి రిపోర్టును పత్రికలకు విడుదల చేసింది. ఆ ప్రయత్నం ఫలితంగా మిల్లు మేనేజ్‌మెంటు "హెల్పర్ల"ను నియమించడం అనే చట్ట వ్యతిరేకమయిన పద్ధతికి స్వస్తి చెప్పింది.

ముగింపు:

1984 జూలై నుండి అనవరతంగా వస్తూన్న స్వేచ్ఛ పత్రికలను చూస్తే ఎ పి సి ఎల్ సి రికార్డు స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ సంచికతో ఇప్పటికి 30 సంచికలు వచ్చాయి. వీటిలో ఎ పి సి ఎల్ సి నిజ నిర్ధారణ కమిటీల రిపోర్టులు 173 ప్రచురించారు. 46 వ్యాసాలు, 16 "చరిత్ర" వ్యాసాలు, 48 పొరుగు రాష్ట్రాల రిపోర్టులు, ప్రచురించాము.

"ఎ పి సి ఎల్ సి నక్సలైట్లపైన జరిగే అత్యాచారాలను మాత్రమే ఖండిస్తుంది" అని రకరకాల శత్రువులు చేసే ఆరోపణలు ఎంత అసత్యమో ఈ రిపోర్టులను పరిశీలిస్తే తెలుస్తుంది. ఈ 173 రిపోర్టులలో 38 మాత్రమే- అంటే 22 శాతం రిపోర్టులు మాత్రమే-నక్సలైట్లు వాళ్ళ సానుభూతిపరుల మీద జరిగే పోలీసు దాడులకు సంబంధించినవి. మిగిలిన వాటిలో 62 రిపోర్టులు పోలీసు కస్టడీలో సాధారణ ఖైదీల మరణానికీ, 15 రిపోర్టులు పోలీసు కాల్పులకు, 7 రిపోర్టులు పోలీసు కస్టడీలో మానభంగాలకూ సంబంధించినవి. తక్కిన 48 రిపోర్టులు భూస్వాముల అత్యాచారాలు, కార్మికుల హక్కులు, వాతావరణ కాలుష్యం, వరకట్నం చావులు, సాధారణ ప్రజానీకంపైన పోలీసు అత్యాచారాలు తదితర విషయాలకు సంబంధించినవి.

నిజానికి "నక్సలైట్ల వేట" పేరిట మన రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నో అత్యాచారాలను వెలికి తీయడం కష్టమయి ఎ పి సి ఎల్ సి ఆ పని చేయలేక పోతోంది. ఉత్తర తెలంగాణా జిల్లాలలోనూ తూర్పు గోదావరి విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలలోనూ పోలీసులు ఊళ్ళకు ఊళ్ళు కూలగొట్టి తగలబెట్టి ఖాళీ చేయిస్తున్నారు, పొలాలు పశువులకు మేపుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. స్త్రీలమీద అత్యాచారాలు చేస్తున్నారు. ప్రజలను పోలీసు క్యాంపులలోనూ లాకప్పులలోనూ విపరీతమైన చిత్రహింసలకు గురి చేస్తున్నారు. గ్రామాలమీద దాడిచేసి ప్రజలను బజార్లోకి ఈడ్చి చితకబాదుతున్నారు. చెప్పనలవికాని హింసాకాండను అమలు చేస్తున్నారు. దీనిని ఇంకింతగా బహిర్గతంచేసి ప్రతిఘటించవలసిన బాధ్యత ఎ పి సి ఎల్ సి మీద వుంది. ○

# రాజకీయాలు - ప్రజల హక్కులు

ఈ మధ్య ఒక అమెరికన్ ప్రొఫెసర్‌తో మాట్లాడుతున్నపుడు మన పోలీస్ యంత్రాంగం గురించి ఆయన ఒక అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అదేమిటంటే అమెరికాకి ఇక్కడున్న పోలీసు వ్యవస్థకి ఒక ముఖ్యమైన తేడా వుంది. అక్కడ "పోలీసులను ప్రజలనుండి రక్షించాలి" ఇక్కడ "ప్రజలను పోలీసులనుండి రక్షించాలి" అని. దీన్నిబట్టి చూస్తే 1860లో బ్రిటిష్ వాళ్ళ పద్ధతికి మార్పు లేదా? ఇంకా పద్ధతులు హింసాత్మకంగా పెరిగి పోతున్నాయా? గత 100-150 సంవత్సరాలుగా మార్పు